క్లుప్తంగా

కేజ్ వీల్స్ ట్రాక్టర్లను నియంత్రించండి

వీపనగండ్ల: బీటీ రోడ్లలో విచ్చలవిడిగా ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్స్‌తో తిరుగుతుండడంతో రోడ్లు పాడవుతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల మండల కేంద్రం నుంచి నిర్మించిన గోవర్ధనగిరి, తూంకుంట రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ యజమానులు తిప్పుతుండడంతో రోడ్లు పాడవుతున్నాయి. అలాగే వల్లభాపూర్ నుంచి తెల్లరాళ్లపల్లి చౌరస్తా వరకు కల్వరాల్ల నుంచి పుల్గర్‌చర్ల, బొల్లారం తదితర గ్రామాలలోని బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్‌తో తిరిగే ట్రాక్టర్ల యజమానులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శివాంజనేయ ఉత్సవాలు ప్రారంభం



దేవరకద్ర: నార్లోనికుంట్లలో ఆదివారం ఘనంగా శివాంజనేయ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పతాకావిష్కరణ, అఖండ దీపారాధన, స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞము ఘనంగా నిర్వహించారు.

నేడు సామూహిక గీతాహవనము

ఆలయంలో సోమవారం సామూహిక గీతాహవనము, ఆధ్యాత్మిక ఉపన్యాసములు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి అఖండ భజన తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం నిర్వహించడానికి దేవస్థాన కమిటీ వారు ఏర్పాట్లను చేశారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజలు



దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం వేద పండితులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఏ సమస్య వచ్చినా ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు. అదేవిధంగా ఎమ్మెల్యేను వివిధ మండలాల నాయకులు ఘనంగా సన్మానించారు. మార్కెట్ మాజీ చైర్మన్ అరవింద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. పేదలకు వరం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

గుడ్ మార్నింగ్ దేవరకద్ర....

నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోడానికి ప్రతి వారం నాలుగు రోజుల పాటు గుడ్ మార్నింగ్ దేవరకద్ర పేరుతో ఏదో ఒక గ్రామాన్ని సందర్శించి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరిస్తామని పెద్ద సమస్యలు ఉంటే సీఎం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు అధికారులతో సమీక్ష..

క్యాంపు కార్యాలయంలో సోమవారం అన్ని శాఖలకు సంబంధించి సమీక్షలు జరుగుతాయని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నీటి విడుదల విషయంలో అధికారులతో మాట్లాడుతామని కోయిల్‌సాగర్, సరళా సాగర్ నీటి లభ్యతను బట్టి యాసంగి పంటలకు నీటిని వదిలే విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

వ్యక్తి మృతి

ఖిల్లాఘనపురం: కూలీ పనులకు వచ్చి గుండె పోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ముసాపేట మండలం తిమ్మాపురం చెందిన మన్యంకొండ (50) ఆదివారం మండలంలోని అంతాయపల్లికి వరిగడ్డి ఎదరడానికి కూలీ పనులకు వచ్చాడు. మధ్యాహ్నం ఛాతిలో నొప్పిరావడంతో మండల ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. పరిస్థితి గమనించిన సిబ్బంది నొప్పి తగ్గడానికి మందులు ఇచ్చి వెంటనే మహబూబ్‌నగర్ ఆస్పత్రికి వెళ్లమని సూచించారు. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన వెంటనే రోడ్డు పక్కన కిందపడిపోయాడు. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా ఆయన అప్పటికే మృతి చెందాడు. భార్య నాగమ్మ గ్రామస్తులతో అక్కడికి చేరుకుని భర్త మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు.

బోర్లపడి మరొకరు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రమాదవశాత్తు బోర్లపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. కర్నూల్ జిల్లాలోని ఎమ్మిగనూర్ పట్టణానికి చెందిన ఆకుతోట మహేష్ (36) కొంత కాలంగా కుటుంబంలో సమస్యల రావడంతో వారికి దూరంగా ఎర్రవల్లిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఓ షాపు ముందు ప్రమాదవశాత్తు బోర్ల పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని గద్వాలకు తరలించారు. తల్లి కుళాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిలిచిన 'మన ఊరు-మన బడి'



ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు

- బిల్లులు రాక కాంట్రాక్టర్ల ఆందోళన
- కొత్త ప్రభుత్వంపై ఆశలు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన మన ఊరు మన బడి పథకంలో చేపట్టిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రాష్ట్రంలో విడతల వారీగా పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదటి విడతలో చేపట్టిన పనులకు ఇప్పటివరకు పూర్తిస్థాయి లో బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన వారు కొత్త ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందా అంటు ఆశగా ఎదురు చూస్తున్నారు.



కప్పు వరకు ఉన్న డైనింగ్ హాల్

15 పాఠశాలలు ఎంపిక..

ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం తీసుకువచ్చిన మనఊరు మనబడి పథకంలో మొదటి విడతలో మండలంలో 15 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో మూడు ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఇప్పటివరకు మొత్తం 10 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మరో 5 పాఠశాలల్లో 80 శాతం పనులు పూర్తి అయ్యాయి.

అందని బిల్లులు

మండలంలో 15 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, గోడల మరమ్మతు తదితర పనులు చేసేందుకు గాను ప్రభుత్వం మొత్తం రూ.4.54 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇప్పటివరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రూ.2.10 కోట్ల బిల్లు మాత్రమే అందింది. మిగతా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు.

బిల్లులు చేసి పంపించాం



మండలంలో మొత్తం 15 పాఠశాలల్లో మన ఊరు మనబడి పనులు చేపట్టారు. ఉప్పరిపల్లిలో మినహా దాదాపుగా అన్ని పాఠశాలల్లో పనులు చివరి దశకు వచ్చాయి. ఇప్పటి వరకు మొత్తం రూ.2.10 కోట్ల బిల్లులు వచ్చాయి. మిగతా పనులకు బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు విడుదల అయిన వెంటనే పనులు చేపట్టిన వారికి ఇస్తాం.

– సాయిరెడ్డి, విద్యాశాఖ ఏఈ, ఖిల్లాఘనపురం

బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తి



కేతేపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి సమీపంలో ఆర్ అండ్‌బీ రహదారిపై నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు తప్పడంలేదు. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డుపై వర్షపు నీటితో పాటు సమీపంలోని చెరువు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గమనించిన ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి గతేడాది మార్చి 30వ తేదీన శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఏడాది లోపు బ్రిడ్జి పూర్తి చేసి ఇబ్బందులను తొలగిస్తామని చెప్పినా నేటికి నిర్మాణం పూర్తి కాలేదు. నిత్యం వనపర్తి నుంచి కొల్లాపూర్‌కు ఈ రహదారిపై ప్రయాణాలు ఎక్కువగా కొనసాగుతుంటాయి. బ్రిడ్జి నిర్మాణ సమయంలో స్లాబ్ కుంగిపోవడంతో పనుల్లో జాప్యం జరిగిందని, ఆయా పనులను సంబంధిత కాంట్రాక్టర్ పునర్‌నిర్మాణం చేపట్టడం, బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడంతో పనుల్లో కొంత జాప్యం అయ్యిందని అధికారులు తెలుపుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ రాకేష్‌ను వివరణ కోరగా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మురుగు నిల్వతో దుర్వాసన

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, ఇళ్ల పక్కన గుంతలల్లో మురుగు నిల్వతో దుర్వాసన వస్తుందని పరిసరాల ఇళ్ల యజమానులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు, పంచాయితీ సిబ్బందికి విన్నవించిన ఏమాత్రం పట్టించుకోవడంలేదని కాలనీవాసులు చెబుతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి వారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నా గ్రామాల్లో ఇలాంటి మురుగు నిల్వ ప్రాంతాలు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. పంచాయతీ సిబ్బంది స్పందించి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఇళ్ల సమీపంలో మురుగు నిల్వలు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

అమరచింత: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన తిరుమల శేఖర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుడి కుటుంబం చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తుండటంతో ప్రభుత్వ పరంగా రావల్సిన బీమాను వర్తింపచేసి ఆదుకుంటామన్నారు. చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్యతో ఫోన్‌లో మాట్లాడి చేనేత బీమా వెంటనే వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని తెలిపారు. తక్షణ సాయంగా రూ.10వేలను అందించారు.



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఎమ్మెల్యే వెంట అయ్యుబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, విష్ణు, జుబేర్ పలువురు ఉన్నారు.

అధ్వానంగా రామన్‌పాడు దారి



ఆత్మకూర్ నుంచి రామన్‌పాడుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల ముళ్లపొదలు

ఆత్మకూర్: ఆత్మకూర్ నుంచి రామన్‌పాడ్ ప్రాజెక్టుకు మార్గం అధ్వానంగా మారింది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ఆరోడ్డు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఇరువైపుల ముళ్లపొదలు రోడ్డుకు కప్పేశాయి. దీనికి తోడు రోడ్డంతా గుంతలమయం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇది వరకే ముల్లపొదల తొలగింపు, మరమ్మతులకు రూ.లక్షల నిధులు మంజూరైన పనులు చేయకుండానే ఆ నిధులను పక్కదారి పట్టించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పీజేపీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయడంతో పాటు ముళ్ల పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొత్తకోట నుంచి కురుమూర్తికి పాదయాత్ర

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఛత్రపతి వాకింగ్ క్లబ్ సభ్యులు కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు ఆదివారం ఉదయం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో పాదయాత్రగా వెళ్లి దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నట్లు క్లబ్ గౌరవ అధ్యక్షులు రాంరెడ్డి, చీర్లయాదయ్యసాగర్, వెంకట్రాములు తెలిపారు. సభ్యులతో కలిసి సామాజిక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రవిసాగర్, శ్రీనివాసులు, భాస్కర్, రవి, రాము, రాంచంద్రారెడ్డి, యాదగిరి, రాజుయాదవ్, రవిందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న వాకింగ్ క్లబ్ సభ్యులు

అయ్యప్ప భక్తుల పూజలు

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, హోటల్ రాజు నివాసాల్లో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. అలాగే అయ్యప్ప కాలనీలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతినిత్యం పూజ కార్యక్రమాలతో పాటు మాలదారులకు అన్నదానం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

హజ్ యాత్రికుడికి సన్మానం

కొత్తకోట: పట్టణానికి సుల్తాన్ హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు సుల్తాన్ ఇంటికి వెళ్లి పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు. భక్తిశ్రద్ధలతో యాత్ర విజయవంతంగా ముగించుకుని తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీజే.బాబు, బోయేజ్, శ్రీనివాసులు, సలీంఖాన్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, మోహన్‌రెడ్డి ఉన్నారు.

గ్రామీణ బస్సుల్లో పెరుగుతున్న రద్దీ



వీపనగండ్ల: ఇటీవల ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఛార్జీలు తీసుకోకపోవడంతో బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య రోజురోజుకు రెట్టింపవుతుంది. మండల కేంద్రం నుంచి పాన్‌గల్, వనపర్తి, కల్వరాళ్ల, కంచిరావుపల్లి, తూంకుంట, కొల్లాపూర్ తదితర గ్రామాల నుంచి పలు పట్టణాలకు వెళ్లే బస్సుల్లో మహిళలు అధికంగా ప్రయాణిస్తున్నారు. వారం రోజుల పాటు ఎలాంటి గుర్తింపు కార్డు చూపించకున్నా బస్సుల్లో ప్రయాణించవచ్చని సూచించడంతో మహిళలు అధికంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు.

విద్యుత్ తీగలతో ప్రమాదం





కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న గ్రామస్తులు

ఆత్మకూర్: మండల పరిధిలోని కత్తేపల్లిలో చేతు లెత్తితే విద్యుత్ తీగలు తగులుతున్నాయని ఇదివరకే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు సమాచారం అందించిన పట్టించుకోవడంలేదని సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి విద్యుత్ తీగలు సరిచేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టింపేలేదు

- ప్రమాదకర మలుపులతో నవాబుపేట– మహబూబ్‌నగర్ రోడ్డు
- ఎక్కడా కానరాని సూచికబోర్డులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న పాలకులు, అధికారులు



నవాబుపేటలో మలుపులు

నవాబుపేట: మహబూబ్‌నగర్– నవాబ్‌పేట్ రోడ్డు ప్రమాదకర మలుపులతో ప్రయాణికుల్లో గుబులు పుట్టిస్తోంది. నల్లమల్ల ఘాట్‌రోడ్డును గుర్తుకు తెచ్చే ఈ దారిలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అడుగడుగునా మలుపులతో పాటు, మరమ్మతుకు గురైన కల్వర్టులతో ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ దారిపై ప్రాణాలు అరచేత పెట్టుకుని ప్రయాణం చేయాల్సిందని ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డుపై కొత్త ప్రయాణించేవారు అవగాహన లోపంతో ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల రుద్రారం గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి రాత్రి సమయంలో కల్వర్టు దగ్గర ఎలాంటి సూచికలు లేకపోవడంతో గుర్తించక అందులో పడి మృతిచెందిన ఘటననే ఉదాహరణ అని అంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ పాలకులకు, అధికారులకు ఎలాంటి పట్టింపు లేకుండా పోయింది. కనీసం సూచిక బోర్డులు, వేగనిరోధకాలు వంటివి ఎక్కడా ఏర్పాటు చేయలేదు. గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్నప్పుడైతే రోజుకో ప్రమాదం జరిగేది. ప్రస్తుతం డబుల్ రోడ్డు మార్చాక ఈ తీవ్రత కొంత తగ్గినప్పటికీ.. మలుపుల వద్ద వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రమాదాల స్థలంలోనే సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయడం మరిచారని పలువురు ఆరోపిస్తున్నారు. నవాబుపేట నుంచి యన్మన్‌గండ్ల మలుపు, గద్దగుండు మలుపు, రుద్రారం, కాకర్లపహడ్ మలుపు, పర్వతాపూర్ మైసమ్మ అడవి ప్రాంతం, చిక్కుడు వాగు వద్ద మలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయని ఇప్పటికైనా సూచికబోర్డులు, వేగనియంత్రకాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి



రుద్రారం కల్వర్టు దగ్గర తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. దగ్గరకు వచ్చాకగానీ సమస్య ఉందని గుర్తించడానికి ఆస్కారం లేదు. కొత్త వారైతే కచ్చితంగా ప్రమాదం బారిన పడతారు. రోడ్డు వెంట ఎలాంటి సూచికలు లేవు. కల్వర్టు రక్షణ గోడలు సైతం లేవు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– సతీష్‌చంద్ర, నవాబుపేట

ఉన్నతాధికారులకు వివరిస్తాం

మహబూబ్‌నగర్– నవాబుపేట రోడ్డులో ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. మైసమ్మ దేవాలయం ప్రాంతంలో అడవిలో అతివేగంగా వాహనాలు వెళ్తడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు వేసిన కొత్తలో 5 కొన్ని చోట్ల సిగ్నల్స్ ఏర్పాటు చేశాం. అవి కాస్తా పడిపోయాయి. వాటికి మరమ్మతు చేయించడంతో పాటు సమస్యలపై ఉన్నతాధికారులకు వివరిస్తాం.

–రాములు, ఇన్‌చార్జ్ ఏఈ

'మహాలక్ష్మి' భాగ్యం కల్పించండి



మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతున్న జడ్చర్ల బస్టాండ్

- గ్రామీణ ప్రాంతాలకు బస్సుసౌకర్యం ఏర్పాటుచేసి లబ్ధి చేకూర్చాలంటున్న మహిళలు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభం కావటంతో మహిళల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. ఈ నేపథ్యంలోనే తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి.. తమకు మహాలక్ష్మి భాగ్యం కలిపించి లబ్ధి చేకూర్చాలని నియోజకవర్గంలోని ఆయా గ్రామాల మహిళలు అభిప్రాయ పడుతున్నారు. ఎలాంటి చార్జ్ లేకుండా బస్సు ప్రయాణం చేయవచ్చని సంతోష పడుతున్నప్పటికీ.. తమ గ్రామాలకు సౌకర్యం లేదని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నియోజకవర్గంలోని జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్ మండలాల్లో ఏ ఒక్క గ్రామానికి కూడా పల్లె వెలుగు బస్సు సౌకర్యం లేదని, ఇన్ని రోజులుగా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రయాణాలు చేస్తున్నామని చెబుతున్నారు.

గతంలోని రూట్లు ఇలా..

జడ్చర్ల పరిధిలోని ఎక్వాయపల్లి, చిన్న ఆదిరాల మండల కేంద్రానికి 25 కి.మీ దూరంలో ఉన్నాయి. ఈ మార్గంలో కోడ్గల్, కొండేడ్, లింగంపేట గ్రామాలతోపాటు పది తండాలున్నాయి. ఎక్వాయపల్లి మీదుగా కల్వకుర్తి నియోజకవర్గంలోని తొమ్మిదిరేకుల, కేశంపేట వెళ్లవచ్చు. గతంలో బాదేపల్లి బస్టాండ్ నుంచి ఈ మార్గంలో కేశంపేట వరకు బస్సులు నడిచేవి, అలాగే బండమీదిపల్లి, వల్లూరు, ఉదండాపూర్, తీగలపల్లి మీదుగా నవాబుపేట మండలం కాకర్లపాడు, పర్వతాపూర్ మైసమ్మ, మహబూబ్‌నగర్ చేరుకునేలా బస్సు సౌకర్యం ఉండేది. అదేవిధంగా బాదేపల్లి బస్టాండ్ నుంచి ఆలూరు మీదుగా మొల్గరకు, అక్కడి నుంచి తిరిగి ఆలూరు నుంచి హైదరాబాద్ వరకు బస్సులు నడిచేవి. ఉమ్మడి బాలనగర్ మండలంలోనూ అనేక గ్రామాలను కలుపుతూ కేశంపేట, నవాబుపేట, ఫరూక్‌నగర్ మండలాలకు బస్సు సౌకర్యం ఉండేది. నవాబుపేట మండలంలో ఫరూఖ్‌నగర్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, వికారాబాద్ ప్రాంతాలకు గ్రామాల నుంచి బస్సు సౌకర్యం ఉండేది. కాగా దశాబ్దకాలంగా ఆయా ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేకుండా పోవటంతో ప్రజలు ప్రైవేట్‌వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి రావటంతో తమ గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు వేయాలని మహిళలు కోరుతున్నారు. తద్వారా తమతో పాటు విద్య, ఉద్యోగం, వ్యాపారంతోపాటు ఇతర పనులపై వెళ్లే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నారు. అదేవిధంగా మల్లెబోయిన్‌పల్లి 167, 44వ నంబరు జాతీయరహదారులకు సమీపంలోనే ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ నుంచి భూత్పూర్ వెళ్లే మినీబస్సులు తమ గ్రామం మీదుగా వెళ్లేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా బాదేపల్లి బస్టాండ్ నుంచి షాద్‌నగర్ బస్సులు నడిపించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జడ్చర్లకు పోవాల్సిందే..



ప్రభుత్వం బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభించటం బాగుంది. అయితే మేం బస్సు ఎక్కాలంటే జడ్చర్లకు పోవాల్సిందే. ఇంతకు ముందు బాదేపల్లి నుంచి కేశంపేట వరకు బస్సులు నడిపించేవారు. పదేళ్లుగా పూర్తిగా ఆపేశారు. ఉచిత ప్రయాణం ప్రారంభించినందుకు పల్లెటూళ్లకు బస్సులు వేస్తే మాకు లాభం చేకూరుతుంది. ఈ మేరకు చర్యలు చేపట్టాలి

–రాములమ్మ, పెద్ద ఆదిరాల

బస్సులు నడపండి



మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇంతకుముందు మా ఉదండాపూర్ మీదుగా బాదేపల్లి–మహబూబ్‌నగర్ బస్సులు నడిచేవి. కానీ చాలా రోజులుగా బంద్ చేశారు. మళ్లీ బస్సులు నడిపిస్తే మా లాంటి వారికి మేలు కలుగుతుంది.

–అంజమ్మ, ఉదండాపూర్